# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | ఆదివారం 27-10-2024 | సంపుటి : 06 | సంచిక : 32 | పేజీలు : 8 | వెల : రూ 3-00



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్,B.A:L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787


## శింగనమలలో ఘోర రోడ్డు ప్రమాదం

### ఆరుగురు దుర్మరణం

అనంతపురం,అక్టోబర్26 :అనంతపురం జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద లారీని కారు ఢీకొంది. టైరు పగిలి అదుపుతప్పిన కారు.. ఎదురుగా వస్తున్న లారీనీ ఢీకొట్టడంతో నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో కారులోని ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరంతా తాడిపత్రిలో నగర కీర్తన వేడుకలో పాల్గొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులంతా అనంతపురానికి చెందిన సంతోష్, షణ్ముక్, వెంకన్న, శ్రీధర్, ప్రసన్న, వెంకీగా గుర్తించారు.

# కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వైసీపీ కుట్ర

**టిడిపి పనై పోయిందన్న వారే కనుమరుగు అయ్యారు**

**ఎక్కడ ఇసుక దందా జరిగినా తిరుగబాటు చేయండి**

**రాజకీయంగానే ముందుకు వెళదాం..కార్యకర్తలకు న్యాయం చేస్తా**

**టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు**



అమరావతి,అక్టోబర్26 : కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేలా వైసీపీ నేతలు కుట్ర పన్నుతున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంలోకి వైసీపీ నేతలు చొరబడ్డారని విమర్శించారు. ఎక్కడ ఇసుక దందా జరుగుతున్నా తిరుగుబాటు చేయండి, తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. మద్యం ఎమ్మార్పీ ధరపై ఒక్క రూపాయి కూడా ఎక్కువ చెల్లించవద్దని మందుబాబులను కోరారు. శనివారం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో సీఎం చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ పార్టీపై, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఎస్టీతో కలిపి రూ.97 లు అయ్యే సినరేజ్ ఛార్జీకి రూ.35లకే టెండర్ వేస్తామంటూ వైసీపీ నేతలు వచ్చారని అన్నారు. ఇసుక కొరత సృష్టించి బ్లాక్‌మార్కెటింగ్ చేసి తమ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలనే అతి తక్కువ ధరకు టెండర్లు వేశారని చెప్పారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా, ఉచిత ఇసుక స్ఫూర్తి దెబ్బతినకూడదనే సినరేజ్ ఛార్జీలు, జీఎస్టీ కూడా ఎత్తివేశామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.నేను 1995 సీఎంనే.. కానీ 2014 సీఎంను కాదు. ఈసారి ఖచ్చితంగా రాజకీయ పరిపాలనే చేస్తా. విశ్వసనీయతను నిలబెట్టుకుంటూ రాజకీయ ముసుగులో తప్పు చేసిన వారిని ఉపేక్షించేది లేదు. ముఖ్యమంత్రి అయ్యాక పార్టీ వ్యవహారాలు పట్టించుకోవట్లేదని కేడర్ నుంచి వస్తున్న విమర్శలు అర్థం చేసుకోగలను. జగన్ చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ రూ.10లక్షల కోట్లకు పైగా అప్పు భారం మోస్తున్నామనే విషయం గ్రహించాలి. మనం ఓ విషవలయంలో ఉన్నామని గుర్తించాలి. దీనిని పరిష్కరించేందుకు కొంత సమయం అవసరం. ఇప్పటికే చాలా వ్యవస్థలను గాడిలో పెట్టాం. మొన్నటి ఎన్నికల్లో రాక్షసుడితో యుద్ధం చేశాం. వైసీపీ నేతల వల్ల నష్టపోయిన కార్యకర్తలను ఆదుకుంటూనే, ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నెరవేర్చాలి. జగన్ ప్రభుత్వం కక్షపూరితంగా పెట్టిన తప్పుడు కేసులకు చట్ట పద్ధతిలోనే పరిష్కరిస్తా. ఎవ్వరూ తొందరపడొద్దు. ఎక్కువ అంచనాలు పెట్టేసుకుని ఎవ్వరూ నిరుత్సాహపడొద్దు. రాజకీయాల్లో ఎన్ని మార్పులు, సంస్కరణలు వచ్చినా, మూల సిద్ధాంతం ప్రజాసేవని మరవద్దని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అనేక మంది నాయకులను తయారు చేసిన పార్టీ తెదేపా అని ఆ పార్టీ చంద్రబాబు నాయుడు అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన మంగళగిరిలో ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. రాజకీయ విశ్వవిద్యాలయం తెలుగు దేశం పార్టీ. నేటి తరం చాలా మంది తెలుగు రాజకీయ నాయకుల మూలాలు తెదేపాలోనే ఉన్నాయి. రాజకీయ కార్యకర్తల కోసం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కార్యకర్తలను నాయకులుగా తయారు చేసేందుకు అనునిత్యం పనిచేస్తున్నాం. వారి సంక్షేమం కోసం ముందుకెళ్లాం. రాజకీయ కక్షలకు బలైన సంఘటనలు చాలా చూశాం. అనేక కారణాలతో కార్యకర్తలు చనిపోయారు. వారి కుటుంబాలను ఆదుకుంటున్నాం అని అన్నారు. తెదేపా పనైపోయిందన్న వాళ్ల పనైపోయింది. పార్టీయే శాశ్వతం. తెదేపాకు ముందు.. ఆ తర్వాత అన్నట్లు తెలుగుజాతికి గుర్తింపు వచ్చింది. కార్యకర్తల మనోభావాలు గౌరవించే పార్టీ తెదేపా. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు ప్రమాద బీమా పెట్టిన పార్టీ ఇది. జాతీయ స్థాయిలో తెదేపా పోషించిన కీలకపాత్రలు మరే పార్టీకి సాధ్యం కాలేదన్నారు. రాజకీయ ముసుగులో తప్పు చేసిన వారిని ఉపేక్షించేది లేదు. క్యాడర్ నుంచి వస్తున్న విమర్శలను అర్థం చేసుకోగలను. అని చంద్రబాబు అన్నారు.

# అమెరికాకు చేరుకున్న నారాలోకేశ్

## పెట్టుబడులే లక్ష్యంగా పర్యటన




న్యూఢిల్లీ, అక్టోబర్ 26 : పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో నగరానికి చేరుకున్న రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌కు ఎయిర్‌పోర్టులో ఐటీ సర్వ్, ఎన్ఆర్ఐ టీడీపీ ప్రతినిధులు అపూర్వ స్వాగతం పలికారు. ఏపీలో ఎన్డీఏ కూటమి "అఖండ" విజయం సాధించిన తర్వాత తొలిసారిగా అమెరికాలో లోకేష్ పర్యటిస్తున్నారు. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మంత్రి లోకేష్ అమెరికా పర్యటన సాగనుంది. ఈనెల 29న లాస్ వేగాస్ నగరంలో జరుగనున్న ఐటీ సర్వీస్ సినర్జీ 9వ సదస్సుకు మంత్రి హాజరుకానున్నారు. 31న అట్లాంటాలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో లోకేష్ పాల్గొననున్నారు. శాన్ ఫ్రాన్సిస్కోలో పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. వై2కె బూమ్ నేపథ్యంలో హైదరాబాద్, బెంగుళూరు నగరాల్లో ఐటీ శరవేగంగా అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఏఐ అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి సాధించబోతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అనుకూలతలు, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలను మంత్రి వివరించారు. భారత్‌లో రాబోయే పాతికేళ్లలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకోబోతున్నాయని పరిపాలనలో ఏఐ వినియోగం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలను అందించేందుకు తాము కృషి చేస్తున్నామని తెలిపారు. నాలుగవ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నేతృత్వంలో యువనాయకత్వం చురుగ్గా పనిచేస్తోందన్నారు. మంత్రివర్గంలో 17 మంది కొత్తవారే ఉన్నారని.. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో మ్యాన్యుఫ్యాక్చరి ంగ్, రెన్యువబుల్ ఎనర్జీ, బయో ఎనర్జీ, ఆక్వా, పెట్రో కెమికల్ రంగాల్లో పెట్టుబడులకు విస్తృతమైన అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి ద్వారా పేదరిక నిర్మూలనకు సీఎం సరికొత్త పీ-4 విధానా నికి శ్రీకారం చుట్టారని మంత్రి తెలిపారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తీసువస్తామన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణ ంగా నైపుణ్యతతో కూడిన మానవవనరులను అందించడానికి, తద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు విద్యారంగంలో కూడా సంస్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు. నవీన ఆవిష్కరణల కోసం విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు ప్రాధాన్యతనిస్తా రీసెర్చి సెంట్రిక్‌గా చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## ప్రపంచ సమస్యగా ఉద్యోగ కల్పన: నిర్మలా సీతారామన్

వాషింగ్టన్, అక్టోబర్ 25: ఉద్యోగాల కల్పన అనేది అత్యవసరమైన ప్రపంచ సమస్యగా మారుతున్నదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆమె గురువారం ప్రపంచ బ్యాంకు నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కొనసాగుతున్న ఆర్థిక ఎదురుగాలులు, సాంకేతికంగా సంభవిస్తున్న పెను మార్పులు జాబ్ మార్కెట్‌లో యువతకు అవసరమైన నైపుణ్యాలను మార్చేశాయని ఆమె పేర్కొన్నారు.గతంలో హరిత ఉద్యోగాలు, ఏఐతో ఉద్యోగాల ప్రభావం వంటి అంశాలపై ప్రపంచ బ్యాంకు అనేక అధ్యయనాలు చేసిందని ఆమె గుర్తు చేశారు. కొత్తగా వస్తున్న ధోరణుల ప్రభావం ఉద్యోగ కల్పన, ఉద్యోగాల కోతపై ఎలా ఉంటుందో గుర్తించేందుకు మరింత సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. మరిన్ని ఉద్యోగాలు కల్పించేందుకు, సరైన నైపుణ్యాలు అందించేందుకు గానూ డిమాండ్ ఉన్న నైపుణ్యాలను గుర్తించేందుకు వివిధ దేశాలతో ప్రపంచ బ్యాంకు కలిసి పని చేయాలని ఆమె కోరారు.




# వైవీ సుబ్బారెడ్డి.. జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి

**ఆస్తులకు వారి పేర్లు పెట్టుకుంటే వారివే అవతాయా?**

**మేము ఆనాడు అభ్యంతరం చెప్పలేదు కనుకే పేర్లు వచ్చాయి**

**తల్లిని కోర్టుకు ఈడ్చే కొడుకు ఉంటాడా..**


**ఇది ఘర ఘర్‌కీకహానీ ఎలా అవుతుంది**

**మీడియా సమావేశంలో షర్మిల కన్నీటి పర్యంతం**

విజయవాడ,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): వైవీ సుబ్బారెడ్డి.. జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి అని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. అన్ని కుటుంబాల్లో ఉంటే వ్యవహారం అంటూ తమఆస్తులపై జగన్ చేసిన వ్యాఖ్యలపై షర్మిల మండిపడ్డారు. తల్లిపై కేసులు పెట్టి కోర్టుకు లాగడం ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమోషన్‌కు గురైన షర్మిల కన్నీటి పర్యంత అయ్యారు. విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సుబ్బారెడ్డి వ్యాఖ్యపై స్పందించారు. 'న బిడ్డలు కూడా మీ కళ్ల ముందే పెరిగారు.. వారికి అన్యాయం చేయాలని ఎలా అనిపించింది. అన్ని విషయాలు తెలిసి కూడా బాబాయి ఎందుకిలా మాట్లాడుతున్నారు' అని కన్నీటి పర్యంతమయ్యారు. జగన్ పదవులు ఇస్తే సుబ్బారెడ్డి అనుభవిస్తున్నారు.. ఆయన అలా మాట్లాడకపోతే ఇంకెలా మాట్లాడుతారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు సుబ్బారెడ్డి, ఆయన కుమారుడు ఆర్థికంగా లాభపడ్డారు. సుబ్బారెడ్డే కాదు.. సాయిరెడ్డి కూడా అలాగే మాట్లాడొచ్చు. ఎందుకంటే ఆయన కూడా వాళ్ల టీమ్‌లోనే ఉన్నారు. జగన్ పక్కన వాళ్లు ఉన్నారని తెలిసి కూడా నిన్న రాసిన లేఖలో వాళ్ల పేర్లు ప్రస్తావించాను. నేను చెబుతున్నది నిజమని ప్రమాణం చేయగలను. సుబ్బారెడ్డి చెబుతున్నది కూడా నిజమని ఆయన ప్రమాణం చేయగలరా? నలుగురు మనవళ్లకు ఆస్తిలో సమాన వాటా అని రాజశేఖర్‌రెడ్డి బ్రతికుండగానే చెప్పారు. ఇది నిజం.. నా బిడ్డలమీద ప్రమాణం చేసి చెబుతున్నా. ఇది నిజం కాదని.. సుబ్బారెడ్డి, జగన్ ఇద్దరూ వారి బిడ్డలపై ప్రమాణం చేసి చెప్పగలరా? నాకు రావాల్సిన ఆస్తిలో వాటా ఇవ్వకుండా ఏవో చెబితే ఎలా? నా మేలు కోరతానని వైఎస్‌కు జగన్ మాట ఇచ్చారు. సాక్షిలో, భారతి సిమెంట్స్‌లో వాటాలు మావని జగన్ ఎలా చెబుతారు? కంపెనీలకు భారతి, జగతి అని వాళ్ల పేర్లు పెట్టుకున్నారట. ఆరోజు ఆ పేర్లు పెట్టుకోగలిగారంటే కారణం.. రాజశేఖర్‌రెడ్డి అనుమతిచ్చారు,

# శ్రీశైలంలో వాటర్ ఎయిర్ డ్రోమ్..

## జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 26-నవంబర్ మాసం రెండు లేదా మూడో వారంలో సీప్లేన్ ద్వారా ట్రయల్ రన్ నిర్వహించే అవకాశం ఉందని అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం శ్రీశైలంలోని పాతాళ గంగ వద్ద వాటర్ ఎయిర్ డ్రోమ్ ల్యాండ్ అయ్యే బోటింగ్ పాయింట్ ను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నవంబర్ మాసం రెండు లేదా మూడో వారంలో సీప్లేన్ ద్వారా ట్రయల్ రన్ నిర్వహించే అవకాశం ఉందని అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను సూచించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రోప్ వే పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని పర్యాటక రంగ అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ జెట్ ఏర్పాటుతో పాటు ల్యాడర్ కు డెకరేషన్ చేయాలన్నారు. రోప్ వే భవనం, క్యాబిన్, నడకదారుల్లో పారిశుధ్య చర్యలు చేపట్టి పెయింటింగ్ వేసి ఆకర్షణీయమైన రీతిలో తీర్చిదిద్దాలన్నారు. ఆత్మకూరు ఆర్డీఓ ఎం. దాసు, డ్యామ్ ఎస్ఈ రామచంద్రరావు, ఆత్మకూరు, శ్రీశైలం డిఎఫ్ఓలు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, శ్రీశైల దేవస్థానం అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# ఆ నాలుగు పదాలే సామాన్యుల వ్యథలకు నిలువుటద్దం : రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఇటీవల ఢిల్లీలో ఓ బార్బర్ షాప్ కు వెళ్లారు. అక్కడ షేవింగ్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా తనకు షేవింగ్ చేసిన అజిత్ అనే బార్బర్‌తో రాహుల్‌గాంధీ ముచ్చటించారు. బార్బర్ తన సాధకబాధకాలను రాహుల్‌గాంధీతో పంచుకున్నాడు. రోజంతా కష్టపడి పనిచేసినా 'ఏమి మిగలడం లేదు (కుచ్ నహీ బచ్‌తా హై)' సార్ అని చెప్పాడు. బార్బర్‌తో సంభాషణలకు సంబంధించిన వీడియోను ఇవాళ రాహుల్‌గాంధీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.బార్బర్ అజిత్ చెప్పిన 'కుచ్ నహీ బచ్‌తా హై' అనే నాలుగు పదాల మాట దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజల కష్టాలకు నిలువుటద్దమని తన సోషల్ మీడియాలో పోస్టులో రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. దేశంలో పెరుగుతున్న ధరలతో మంగలివాడి నుంచి చెప్పులు కుట్టేవాడి వరకు, కుమ్మరి వాడి నుంచి వడ్రంగి వరకు అందరి సంపాదన పడిపోతున్నదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. పెరుగుతున్న ధరలతో సామాన్యులు దోపిడీకి గురవుతున్నారని అన్నారు.ఎన్డీఏ సర్కారు తీరుతో.. కష్టపడి పనిచేసి షాపులు పెట్టుకోవాలని, సొంత ఇళ్లు కట్టుకోవాలని, ఆత్మగౌరవంతో బతుకాలని సామాన్యులు కంటున్న కలలు కలలుగానే మిగిలిపోతున్నాయని రాహుల్‌గాంధీ ఆవేదన వెలిబుచ్చారు. ప్రజల బతుకులు బాగుపడాలంటే ప్రభుత్వాలు తీసుకొచ్చే కొత్త పథకాలు వారి ఆదాయాన్ని పెంచేవిగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాహుల్‌గాంధీ బార్బర్‌తో మాట్లాడిన వీడియోను కాంగ్రెస్ పార్టీ కూడా సోషల్ మీడియాలో షేర్ చేసింది.

# సంపాదకీయం

ఆదివారం 27-10-2024

## ఆర్థిక విధానాలను ఎన్‌డి పక్షాలు చర్చించాలి !

గత దశాబ్ద కాలంగా మోడీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ప్రజల నడ్డి విరిచేలా చేస్తున్నాయి. ధరలు పెరగడం, పేదలు చితికి పోవడం అన్నది సమాంతరంగా సాగుతోంది. అయినా కిందిస్థాయిలో ఏం జరుగు తున్నదో తెలుసుకోలేక పోతున్నారు. కనీసం ఇప్పటికైనా ఎన్‌డిఎ పక్షాలు ఆలోచనచేయాలి. ప్రజలపై మోపుతున్నా భారాలను తగ్గించాలి. ధరల పెరుగుదలపై చర్చించాలి. మోడీ ఆర్థిక విధానాలను చర్చించాలి. లేకుంటే ఎన్‌డిఎ పక్షాలు కూడా ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదు. కేవలం కార్పొరేట్ శక్తులు బలపడుతున్న తీరు ప్రజలను కలచి వేస్తోంది. పేద,సామాన్య ప్రజలు ఎంతగా చితికి పోతున్నారో గమనించడం లేదు. జిఎస్టీ కారణంగా వస్తువుల ధరలు పెరిగితే ఎవరికి నష్టమో ఆలోచన చేయడం లేదు. దేనిని వదలకుండా జిఎస్టీ పరిధిలోకి తీసుకుని వచ్చినంత మాత్రాన, ప్రభుత్వ ఆదాయం పెరిగినంత మాత్రాన ఆర్థిక సంస్కరణలు భేషుగ్గా ఉన్నాయంటే ఎవరిని వంచించడానికి అన్నది బిజెపి పాలకులు ఆలోచన చేయాలి. ఎన్‌డిఎ భాసగ్వామ్య పక్షాలైన టిడిపి, జనసేన, ఇతర పార్టీలు కడా దీనిని విశ్లేషించాలి. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా మోడీ ఉన్నారే తప్ప ఫలితాలను విశ్లేషించుకుని తప్పులను సరిదిద్దుకుందామన్న లక్ష్యాన్ని ప్రకటించడం లేదు. ప్రజల జీవన స్థితిగతులను పట్టించుకోవడం లేదు. ప్రధాని మోడీ కేవలం తాను అనుసరించిన ఆర్థిక విధానాలను ప్రజలు ఆమోదించారంటూ, చెప్పు కోవడం ఆత్మవంచన తప్ప మరోటి కాదు. కేవలం కాంగ్రెస్ ను, విపక్షాలను తిట్టిపోస్తూ రాజకీయం చేయడమే పాలన కాదు. పాలనలో కొత్త ఒరవడి సృష్టించాలి. ప్రజలకు మేలు జరిగేల సంస్కరణలు ఉండాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలి. ఆహరధాన్యాల ధరలు తగ్గాలి. ఎక్కడ తప్పిదం జరిగిందో పరిశీలన చేయాలి. ప్రజలకు గుజరాత్ మోడల్ అంటూ ప్రచారం చేసి, ప్రధాని పదవిని చేపట్టిన మోడీపై ప్రజలకు విశ్వాసం ఉంటే పరిస్థితులు ఇంత అధ్వాన్నంగా ఎందుకు ఉంటాయి. ప్రజల్లో నివురుగప్పిన అసంతృప్తిని గమనించి సర్దుకోకపోతే వాత తప్పదని మొన్నటి ఎన్నికల ఫలితాల ద్వారా ప్రజలు కొద్దిగా రుచి చూపారు. ఇటీవలి ఎన్నికల్లో ప్రధాని తన వ్యక్తిగత ప్రతిష్ఠను పణంగా పెట్టి ప్రచారం చేశారు. ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తిని తొలగించలేకపోతున్నామని గమనించాలి. సంస్కరణలంటే ప్రజల జీవన ప్రమాణాలు మారాలని గుర్తుంచుకోవాలి. 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత ధరలను, నేటి మార్కెట్ ధరలను ఎందుకు బేరీజు వేసుకోవడం లేదో ప్రధాని మోడీ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఇంతకాలం కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్నా, గట్టిగా పోటీ పడలేకపోయినా ప్రజల ఆలోచనలు కాంగ్రెస్ వైపు మళ్లేలా చేసింది ప్రధాని మోడీ అని గుర్తించాలి. ఇకముందు కాంగ్రెస్ పార్టీ నుంచి గట్టి సవాలు ఎదురవుతుందని భావించాలి. దానికి కాంగ్రెస్ గొప్పతనం కాకుండా మోడీ అనుసరిస్తున్న పిడివాద సంస్కరణల ఫలితమని గుర్తించాలి. హర్యానాలో మళ్లీ అధికారం నిలబెట్టు కోవడం..బిజెపికి ప్రజలు వత్తాసు పలుకుతున్నారని అనుకోరాదు. కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తుందనడానికి కాశ్మీర్, హర్యానా ఫలితాలే ప్రత్యక్ష నిదర్శనం. తాము ప్రవచిస్తున్న సంస్కరణలు ఎక్కడ దారితప్పాయో గమనించాలి. పివి నరసింహారావు లాగా సంస్కరణలు ప్రజలకు ఎందుకు మేలు చేయలేకపోతున్నాయో పరిశీలన చేయాలి. ఇప్పటికైనా నోట్లరద్దు,జిఎస్టీ విపరిణామాలను విశ్లేషించుకోవాలి. విమర్శలను హెచ్చరికగా తీసుకుని ముందుకు సాగితే తప్ప మనలేమని మిత్రద్వయం గుర్తించి ప్రజలకు మేలుచేసే సంస్కరణలను అమలు చేయాలి. అప్పుడే బిజెపి తన అస్తిత్వాన్ని నిలుపుకోగలదు. ఇకపోతే అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మభ్య పెట్టిన మోడీ ఆ ఊసే ఎత్తడం లేదు. పదేళ్లు కావస్తోంది. స్వయం ఉపాధి పేరుతో నిరుద్యోగులను మభ్యపెడు తున్నారు. గత పదేళ్లలో.. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా కార్మిక వ్యతిరేక విధానాలతో వేలాది పరిశ్రమలు మూతపడడానికి కారణం అయ్యారు.బిజెపి ప్రభుత్వ అనాలోచిత, ఏకపక్ష విధానాలు రోజురోజుకు ప్రమాదకరంగా మారుతున్నాయి. పెరుగుతున్న అధిక భారాలు, పన్నులు, నిరుద్యోగం, నూతన విద్యావిధానం, ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, రాజ్యాంగ వ్యవస్థల్లో అనుచిత జోక్యం, రక్షణ రంగంలో ఉద్యోగాల కోతకు వ్యతిరేకంగా దేశ ప్రజలు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ కారణంగా కనీసం 6 కోట్ల మందికి ఉపాధి పోయిందని అంచనా. అన్ని సంస్థలను ప్రైవేటుకు అప్పగించే పనిలో మాత్రం వేగం పెంచారు. రైల్వేరంగాన్ని కార్పోరేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పుతున్నారు. విశాఖ ఉక్కును నష్టాల పేరుతో విదేశీ కంపెనీలకు అమ్మివేసే ప్రయత్నం చేస్తున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక, దిగుబడిలేక ఎంతో మంది రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కరోనా వైరస్ కష్టకాలంలో ఉపాధి లేక వేలాదిమంది ఆకలితో అలమటించారు. ఆసుపత్రులకు డబ్బులు కట్టలేక ఆస్తులు అమ్ముకున్నారు. ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అలాంటి వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఆనాటి పరిస్థితులను చూసి చలించిన ఎందరో వారిని దగ్గరికి తీసి, వారి ఆకలిని తీర్చి వారిని వారి గమ్యస్థలాలకు చేర్చే ప్రయత్నం చేశాయి. కానీ ప్రభుత్వం మాత్రం వారిని గాలికొదిలేసింది. మహిళలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయి. కొన్ని ప్రాంతీయ పార్టీలు కూడా బిజెపి విధానాలను వ్యతిరేకించకుండా అనుకూల రాజకీయాలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం దేశ విదేశీ కార్పొరేట్లకు వివిధ రకాల రాయితీలు, కానుకలు సమర్పిస్తూ వారిని మరింత సంపన్నవంతం చేయడం దారుణం. భారత రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం సగటున ఏడాదికి రెండు లక్షల కోట్ల రూపాయల రుణాలు సంపన్నులకు రద్దయ్యా యన్నది గుర్తించాలి. కార్పొరేట్లు తీసుకున్న రూ.4.5 లక్షల కోట్ల బ్యాంకు రుణాల్లో కేవలం రూ. 1.61 లక్షల కోట్లు మాత్రమే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరుతో వసూలు చేశారు. అంటే బ్యాంకులు రూ.2.85 లక్షల కోట్లు కోల్పోయాయి. ఇలా బ్యాంకుల సొమ్ము కార్పొరేట్ల పాలు అవుతోంది. మోడీ ప్రభుత్వం వచ్చాక పరోక్ష పన్నులను, సెస్సులను పెంచి జనంపై భారాలు పెంచి, ప్రత్యక్ష పన్నుల్లో కార్పొరేట్లకు వివిధ రూపాల్లో రాయితీలు కల్పిస్తోంది. బడ్జెట్లో దాదాపు 8శాతం కార్పొరేట్ పన్ను రాయితీల ద్వారా వారికి లక్షల కోట్ల రూపాయల లబ్ది చేకూర్చింది. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి వాటిని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ఇలా అన్ని విధాలుగా సంపన్నులకు ప్రజల సంపదను దోచిపెడుతున్న సర్కారు సామాన్య రైతులు, సాధారణ ప్రజలపట్ల మాత్రం కర్కశంగా వ్యవహరిస్తోంది.

## కర్నూలు లో మౌర్య హాస్పిటల్ ప్రారంభం





విభారే న్యూస్.. అక్టోబర్ 26కర్నూలు ప్రతినిధి : జిల్లా కేంద్రంలోని దేవ నగర్ రోడ్డులో మౌర్య హాస్పిటల్ ను శనివారం రాష్ట్ర మంత్రులు టిజీ భరత్, ఎన్ఎండి ఫరూక్, నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మౌర్య హాస్పిటల్ నిర్వాహకులుడాక్టర్ ఎం రాజేష్ కుమార్, డాక్టర్ కంచర్ల హరిప్రసాద్, డాక్టర్ వసీం హసన్ రాజా షేక్, డాక్టర్ ఎం. రఘు ప్రవీణ్ లు మాట్లాడుతూ రోగులకు తక్కువ ఖర్చుతో ఖచ్చితత్వం కలిగిన రోగనిర్ధారణ పరీక్షలు మరియు రికవరీ సమయం తగ్గించడం కోసం సరికొత్త సాంకేతికతను ఉపయోగించి అత్యంత అధునాతన చికిత్సా ఎంపికలతో రోగులకు సేవలందించడానికి మేము నిరంతరం ప్రయత్నిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊబకాయం, మోకాళ్ల నొప్పులు, కంటి సమస్యలు, మానసిక రుగ్మత వంటి జబ్బులతో పాటు గర్భిణీ మహిళల కోసం 24 గంటల అత్యవసర వైద్య సేవలు వైద్య నిపుణుల పర్యవేక్షణలో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పొలిటికల్ బాంబులు పేలేది కాంగ్రెస్‌లోనే.. మంత్రి పొంగులేటికి ఎర్రబెల్లి సెటైర్లు



హైదరాబాద్, దీపావళి పండుగకు ముందే తెలంగాణ పాలిటిక్స్‌లో రెండు మూడు పొలిటికల్ బాంబులు పేలబోతున్నాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సెటైర్లు వేశారు. పొంగులేటి చెప్పింది కరెక్టేనని.. దీపావళికి 100 శాతం బాంబులు పేలబోతున్నాయని చెప్పారు. అయితే ఆ బాంబులు కాంగ్రెస్ పార్టీలోనే పేలబోతున్నాయని స్పష్టం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్‌కు వస్తున్న ముప్పును మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముందుగానే పసిగట్టారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎద్దేవా చేశారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు తలోదారి అయ్యారని ఆరోపించారు. ప్రజల దృష్టి మళ్లించడం కోసమే ఈ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు.సీఎం రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఎవరి కుర్చీలు కదులుతాయో త్వరలోనే చూస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకనే సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు.

## ఇజ్రాయెల్ ప్రతీకార దాడుల వేళ.. అన్ని విమానాలను రద్దు చేసిన ఇరాన్


న్యూఢిల్లీ: ఇరాన్ పై ప్రతికారేచ్ఛతో రగిలిపోతున్న ఇజ్రాయెల్.. అన్నంత పనీ చేసింది. టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురిపించింది. ఇరాన్‌కు చెందిన సైనిక స్థావరాలే లక్ష్యంగా శనివారం తెల్లవారుజామున నుంచి ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈ దాడుల నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది.ఇరాన్‌కు రాకపోకలు సాగించే అన్ని విమానాలను రద్దు చేసింది . పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, భద్రతా సమస్యల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. తదుపరి నోటీసులు వచ్చే వరకూ ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ఇరాన్ పౌర విమానయాన సంస్థ ప్రతినిధి జాఫర్ యజార్లో వెల్లడించారు. అన్ని మార్గాల్లోని విమానాలను రద్దు చేసినట్లు స్పష్టం చేశారు.కాగా, ఈనెల 1న ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడిన విషయం తెలిసిందే. దాదాపు 200 మిసైల్స్‌ను టెల్‌అవీవ్‌పై ప్రయోగించింది. ఈ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని




ఇజ్రాయెల్ అప్పట్లోనే ప్రతిజ్ఞ చేసింది. తాజాగా ఇరాన్‌పై ఐడీఎఫ్ ఎదురుదాడులతో విరుచుకుపడింది. మరోవైపు తాజా దాడులపై ఇరాన్ స్పందించింది. మూడు సైనిక స్థావరాలను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకొని దాడులు చేసినట్లు తెలిపింది. ఈ దాడుల్లో పరిమితి స్థాయిలో మాత్రమే నష్టం వాటిల్లిందని వెల్లడించింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ ప్రకటన చేసింది.

## అందరినీ అభివృద్ధి చేసేది మహా వికాస్ అఘాడీ మాత్రమే : సంజయ్ రౌత్

'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' అనేది మా కూటమి నినాదమని, అందరినీ అభివృద్ధి చేసేది 'మహా వికాస్ అఘాడీ కూటమి మాత్రమేనని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు. మహారాష్ట్రలో ఇప్పుడు బలంగా ఉన్న పార్టీలు మూడు మాత్రమేనని.. కాంగ్రెస్, శరద్‌పవార్ కాంగ్రెస్, ఉద్ధవ్ థాకరే శివసేన మాత్రం బలంగా ఉన్నాయని ఆయన చెప్పారు. ఈ ఎన్నికల్లో గెలుపు తమ కూటమిదేనని రౌత్ ధీమా వ్యక్తంచేశారు.ఈ ఎన్నికల్లో మూడు పార్టీలు సమానంగా సీట్లు పంచుకుని బరిలో దిగుతున్నాయని సంజయ్ రౌత్ చెప్పారు. హర్యానాలో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా అన్ని స్థానాల్లో పోటీ చేసిందని, కానీ అధికారంలోకి మాత్రం రాలేకపోయిందని ఆయన గుర్తుచేశారు. అందుకే మహారాష్ట్రలో అందరం ఒక్కటై ముందుకు వెళ్లడం మంచిదనేది




తన అభిప్రాయమని అన్నారు. కాగా మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. మహాకూటమిలోని మూడు పార్టీలు 85 చొప్పున స్థానాల్లో బరిలో దిగనున్నాయి.జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలతోపాటే మహారాష్ట్రలో కూడా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. జార్ఖండ్‌లో నవంబర్ 13, 20 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగనుండగా, మహారాష్ట్రలో నవంబర్ 20న ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను నవంబర్ 23న వెల్లడించనున్నారు.

## బుగ్గన వాకింగ్ ను అడ్డుకోవడం అవాస్తవం...




విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-అక్టోబర్ 26 మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వాకింగ్ కి వస్తున్న సమాచారం మాకు తెలియదని మునిసిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు ఈనెల 25వ తేదీ బుగ్గన వాకింగ్ చేయడానికి మున్సిపల్ కార్యాలయానికి వస్తే గేట్లు వేశారని వస్తున్న వార్తలు అ వాస్తవమని ఆరోజు వాచ్ మెన్ కూడా అనారోగ్యంతో విధులకు హాజరు కాకపోవడంతో అలా జరిగిందని పట్టణ ప్రజలు విరివిగా వాకింగ్ లో పాల్గొనవచ్చని అని ఆయన అన్నారు

## నేడు ఆళ్లగడ్డలో నగర సంకీర్తన




విభారె న్యూస్ అక్టోబర్ 26 ఆళ్లగడ్డ మా ప్రతినిధి :- నేడు ఆళ్లగడ్డ పట్టణంలో హరే కృష్ణ ఉత్సవంలో భాగంగా నగర సంకీర్తన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అహోబిలం ఇస్కాన్ హరినగరం ఇన్చార్జి చంద్రకేశవ దాస్ ప్రభు తెలిపారు . శనివారం ఆయన ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం నుండి నగర రహదారి మీదుగా సంకీర్తనలను రష్యా నుండి వచ్చిన కృష్ణ భక్తులచే నాలుగు రోడ్ల కూడలి వరకు వెళ్లి అమ్మవారి శాల వరకు కీర్తనల కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం కార్తిక దీపోత్సవాన్ని, సాయంత్రం దామోదర మాస విశిష్టత మీద ,వరిష్ట వైష్ణవుల ప్రవచనం హాజరైన భక్తుల చేత యశోద దామోదరులకు దామోదరులకు నేతి దీప హారతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. హాజరైన భక్తులకు భోజన వసతిని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు హాజరు కావాలని ఆయన అన్నారు.

## నూతన విద్యాశాఖ అధికారిని కలిసిన అమీర్ భాష



విభారెన్యూస్ అక్టోబర్ 26 ఆళ్లగడ్డ ప్రతినిధి :- నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారిగాపి జనార్దన్ రెడ్డి శనివారంబాధ్యతలుచేపట్టారు. ఈ సందర్భంగా అపుస్మ ఆళ్లగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు టి. అమీర్ భాష కార్యాలయంలో కలిసి ఆళ్లగడ్డ నియోజకవర్గం ప్రవేటు పాఠశాలల యాజమాన్యసంఘం తరఫున పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మహారాష్ట్ర ఎన్నికల్లో పోటీకి కాంగ్రెస్ రెండో జాబితా

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ కోసం కాంగ్రెస్ పార్టీ రెండో జాబితా ప్రకటించింది. మరో 23 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) సమావేశం తర్వాత రెండో జాబితాను శనివారం విడుదల చేసింది. కాంగ్రెస్, శివసేన (యూబీటీ) మధ్య వివాదంగా మారిన నాగ్‌పూర్ సౌత్ సీటు కాంగ్రెస్‌కు దక్కింది. ఈ నియోజకవర్గం నుంచి గిరీష్ కృష్ణరావు పాండవ్ బరిలోకి దిగనున్నారు.కాగా, తొలి జాబితాలో 48 మంది అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. వీరిలో 25 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు. తాజాగా 23 మందితో రెండో జాబితా రిలీజ్ చేసింది. దీంతో కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు 71 మంది అభ్యర్థులను ప్రకటించింది.మరోవైపు మహారాష్ట్రలో ప్రతిపక్ష కూటమి అయిన మహా వికాస్ అఘాడి (ఎంవీఏ)లో ఎలాంటి విభేదాలు లేవని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. శనివారం సాయంత్రంలోగా భాగస్వామ్య పక్షాల మధ్య తుది సీట్ల పంపకం ఖరారవుతుందని పేర్కొంది. కాగా, మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో నవంబర్ 20న పోలింగ్ జరుగనున్నది.



## సత్తిబాబు దూరం అవుతున్నారా..

విశాఖపట్టణం, అక్టోబరు 26, ఉత్తరాంధ్ర జిల్లాల్లో సీనియర్ నేత బొత్స సత్యనారాయణ. సామాజికపరంగా, ఆర్థికంగా ఆయన బలమైన నేత. ఉత్తరాంధ్రలో ఆయన మోస్ట్ సీనియర్ మాత్రమే కాదు.. ఎన్నో ఉన్నత పదవులు అనుభవించిన బొత్స సత్యనారాయణ వైసీపీ హైకమాండ్ పట్ల అసంతృప్తిగా ఉన్నారా? జగన్ తీసుకుంటున్న నిర్ణయాలు ఆయనకు రుచించడం లేదా? అన్న ప్రశ్నకు నిన్నటి జగన్ విజయనగరం జిల్లా పర్యటన స్పష?టం చేస్తుంది. ఎందుకంటే తన సొంత జిల్లాకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ వస్తే బొత్స సత్యనారాయణ మాత్రం హాజరు కాలేదు. ఎక్కడా ఆయన టూర్ లో కనిపించలేదు. గొర్ల గ్రామంలో పర్యటించిన జగన్ డయేరియా బాధితులను పరామర్శించారు. మృతి చెందిన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అయితే తన సొంత జిల్లాలో పర్యటిస్తున్నప్పుడు కనీసం సమాచారం బొత్స సత్యనారాయణకు లేదంటున్నారు. అందుకే ఆయన ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారని చెబుతున్నారు. సత్తిబాబు లేకుండా తొలిసారి జగన్ విజయనగరం జిల్లాలో పర్యటించినట్లయింది. ఆయన గైర్హాజరీ కారణాలపై పార్టీలో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. బొత్స ఎందుకు రాలేదు? ఆయనలో ఉన్న అసంతృప్తి ఏంటి? జగన్ కు ఆయనకు దూరం పెరిగిందా? మొన్ననే కదా? ఎమ్మెల్సీ సీటు ఇచ్చి మరీ బొత్స సత్యనారాయణను శాసనమండలిలో చీఫ్ గా చేశారు. అలాంటి సత్తి బాబు ఎందుకు దుమ్మా కొట్టారన్న దానిపై పార్టీలో నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు.కానీ కొన్ని కారణాల వల్లనే బొత్స సత్యనారాయణ ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని చెబుతున్నారు. ప్రధానంగా ఉత్తరాంధ్రకు విజయసాయి రెడ్డిని ఇన్‌ఛార్జిగా నియమించడంతో సత్తిబాబు అసంతృప్తితో ఉన్నారని సమాచారం. గతంలో విజయసాయిరెడ్డి వల్లనే పార్టీకి ఇక్కడ డ్యామేజీ జరిగిందని, మళ్లీ జగన్ అదే తప్పు చేశారని బొత్స సత్యనారాయణ భావిస్తున్నారు. తనకు సంప్రదించుకుండానే ఉత్తరాంధ్రకు ఇన్‌ఛార్జిని నియమించడం, అదీ విజయసాయిరెడ్డిన నియమించడంతోనే జగన్ విజయనగరం జిల్లా పర్యటనకు దూరంగా ఉన్నారని కొందరు నేరుగా చర్చించుకుంటున్నారు. విజయసాయిరెడ్డి నియామకం నచ్చని బొత్స తన అసంతృప్తిని ఈ విధంగా తెలియజేశారంటున్నారు. జిల్లాలోనే క్లీన్ స్వీప్ చేసి... మొన్నటి ఎన్నికలలో బొత్స సత్యనారాయణతో పాటు జిల్లాలో అన్ని నియోజకవర్గ స్థానాల్లో కూటమి పార్టీలు క్లీన్ స్వీప్ చేశాయి. తొమ్మిదింటికి తొమ్మిదిస్థానాలు గెలుచుకున్నాయి. వైసీపీకి జీరో సీట్లు వచ్చాయి. జగన్ ఏకపక్ష నిర్ణయాల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని బొత్స సత్యనారాయణ భావిస్తున్నట్లు తెలిసింది. తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని కూడా ఆయన బాధపడుతున్నారని తెలిసింది. ఇప్పటికిప్పుడు ఆయన పార్టీ మారే ఆలోచన చేయకపోయినా తన అసంతృప్తిని మాత్రం అధినేత ఎదుట ఈ విధంగా వెళ్లగక్కారంటున్నారు. మరొకరు తాను వ్యక్తిగత కారణాల వల్ల హాజరు కాలేకపోతున్నానని ముందుగానే పార్టీ హైకమాండ్ కు సమాచారం ఇచ్చారన్న వాదన కూడా వినిపిస్తుంది. మొత్తం మీద జగన్ టూర్ లో సత్తి బాబు లేకపోవడం హాట్ టాపిక్ గా మారింది.

## బాలినేని... వాట్ నెక్ట్స్



ఒంగోలు, అక్టోబరు 26, సైలెంట్ రాజకీయాలకు స్పెషల్ ఆ జిల్లా. ఎప్పుడు ఈ జిల్లా రాజకీయ ముఖచిత్రం ఎలా మారుతుందో కూడా ఎవరికి అర్థం కాని పరిస్థితిగా చెప్పుకోవచ్చు. అందుకు ప్రధాన కారణం ఇక్కడి నాయకుల రాజకీయ ఎత్తుగడలే. ఇటీవల ఈ జిల్లాకు చెందిన మాజీ మంత్రి.. సైలెంట్ పాలిటిక్స్ తో షేక్ చేశారు.ఏపీలోని ప్రకాశం జిల్లా పాలిటిక్స్ అంతా డిఫరెంట్. ఇక్కడి నేతల్లో కొందరి వ్యవహార శైలి చాలా సైలెంట్ గా ఉంటుంది. కానీ వారిచ్చే షాకులు మాత్రం చాలా వైలెంట్ గా ఉంటాయని చెప్పవచ్చు. ఇటీవల ఈ జిల్లాకు చెందిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన పార్టీలోకి చేరడం కూడా సేమ్ టు సేమ్ ఇలాంటిదే.వైసీపీ లో నేనే రాజు.. నేనే మంత్రిలా హవా కొనసాగించిన బాలినేని, ఎన్నికల ఫలితాల అనంతరం వెళుతున్నా.. వెళుతున్నా అంటూ జనసేన లోకి జంప్ అయ్యారు. వైసీపీలో జిల్లా కింగ్ మేకర్ లా ఉన్న బాలినేని, జనసేనలో చేరికను స్థానిక జనసేన నాయకులు ఆహ్వానిస్తే, ఇక్కడి టీడీపీ నేతలు మాత్రం విభేదించారు. దీనికి కారణం వైసీపీలో కొనసాగిన సమయంలో బాలినేని తమను ఇబ్బందులకు గురి చేశారన్నది వారి వాదన.ఇలా బాలినేనికి ఎదురుగాలి వీచినా, అనుకున్నది సాధించి చివరికి చెప్పినట్లుగా డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. అంతవరకు ఓకే గానీ, బాలినేని గారూ.. వాట్ నెక్ట్స్ అంటున్నారు ఆయన క్యాడర్. ఇలాంటి క్రమంలో తాజాగా పవన్ మరీ పిలిపించుకొని బాలినేని తో భేటీ అయ్యారు. ఈ భేటీ వెనుక కారణం ఏమైనా, మరో ఊహించని షాక్ ఇచ్చేందుకు బాలినేని రెడీ అయ్యారన్నది టాక్.అసలే స్థానిక టీడీపీ నేతలు వద్దువద్దంటున్నా.. జనసేనలోకి చేరిన బాలినేనికి నామినేటెడ్ పదవి వరించే అవకాశం ఉందని పొలిటికల్ టాక్. ఇటీవల కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులను భర్తీ చేయనుంది. అందులో కొన్ని జనసేన కు కేటాయిస్తారు. వాటిలో మాజీ మంత్రి బాలినేనికి తప్పక వరిస్తుందని, లేకుంటే పార్టీలో కీలకపదవి దక్కే అవకాశాలు ఉన్నాయని చర్చ సాగుతోంది. అందుకే పవన్ మరీ పిలిపించుకొని, అసలు విషయాన్ని బాలినేనికి చెప్పినట్లు స్థానిక సోషల్ మీడియా కోడై కూస్తోంది.జనసేన లో చేరిన సమయం నుండి సైలెంట్ గా ఉన్న బాలినేని ఎప్పుడు, ఏ షాకిస్తారోనన్నది ప్రకాశం జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. నామినేటెడ్ పదవి వరిస్తే మాత్రం, ఇక జిల్లాలో బాలినేనికి ఎదురులేదన్నది ఆయన అభిమానుల అభిప్రాయం. మరి బాలినేని గారూ.. వాట్ నెక్ట్స్!

# ఏపీలో సోషల్ మీడియా వార్...

నెల్లూరు, అక్టోబరు 26, ఏపీలో సోషల్ మీడియా వార్ పీక్ లెవల్‌లో కొనసాగుతోంది. అటు టీడీపీ..ఇటు వైసీపీ వరుస పెట్టి..పోటాపోటీ పోస్టర్లు, ట్వీట్లతో బ్లాస్టింగ్ న్యూస్ అంటూ ఉత్కంఠ రేపుతున్నాయి. వైసీపీ టీమ్ చంద్రబాబు, లోకేశ్‌ను టార్గెట్ చేస్తే టీడీపీ సోషల్ మీడియా..జగన్‌ను, ఆయన కోటరీని రౌండప్ చేస్తోంది. దీంతో పోటాపోటీ పోస్టులు, ట్వీట్లతో సోషల్ మీడియా హోరెత్తిపోతోంది.ఎన్నికలు అయిపోయాయి. టీడీపీ పవర్‌లోకి వచ్చి ఐదు నెలలు కావొస్తోంది. మళ్లీ ఎన్నికలు జరగడానికి ఇంకో నాలుగేళ్లు అయితే పడుతుంది. కానీ ఏపీలో మాత్రం రేపే ఎన్నికలు ఉన్నాయన్నట్లుగా టీడీపీ వర్సెస్ వైసీపీ సోషల్ మీడియా వార్ హీటెక్కుతోంది. పవర్‌లో ఉన్న టీడీపీ..అపోజిషన్‌లో ఉన్న వైసీపీ ఎవరూ తగ్గడం లేదు. అధినేత జోలికి వస్తే చాలు ఇచ్చి పడేస్తున్నారు. ఏ చిన్న ఇష్యూ దొరికినా దాన్ని హైలెట్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా రచ్చ రచ్చ చేస్తున్నారు రెండు పార్టీల సోషల్ మీడియా కార్యకర్తలు. నేతలు కూడా ఎక్స్, ఫేస్‌బుక్ వేదికగానే తమ రియాక్షన్ ఏంటో తెలియజేస్తున్నారు.ఎన్నికలకు ముందే ఏపీలో సోషల్ మీడియా వార్ ఓ లెవల్‌లో జరిగింది. వివేకా హత్యను ప్రస్తావిస్తూ జగన్‌ను, అవినాశ్‌ను కార్నర్ చేస్తూ వరుస పోస్ట్‌లతో హోరెత్తించింది టీడీపీ సోషల్ మీడియా టీమ్. ఇక పవర్‌లోకి వచ్చాక జగన్‌ను మరింత ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తోంది. లేటెస్ట్‌గా టీడీపీ, వైసీపీ సోషల్ మీడియా టీమ్‌లు పెట్టిన పోస్టర్లు ఉత్కంఠ రేపాయి. అక్టోబర్ 24న మధ్యాహ్నం 12 గంటలకు ఏపీలో ఏం జరగబోతోంది.? అధికార, ప్రతిపక్షాలు ఏం చెప్పబోతున్నాయన్నట్లుగా ఎక్స్ వార్‌తో హీట్ క్రియేట్ చేశారు. ఏదో బిగ్ బ్లాస్టింగ్ న్యూస్ రాబోతుందన్న టెన్షన్ సృష్టించారు. టీడీపీ వాళ్లకు సంబంధించిన కుంభకోణం అంటూ వైసీపీ.. జగన్ ఫ్యామిలీ రచ్చ అంటూ టీడీపీ కౌంటర్ ఇచ్చుకున్నాయి.వైసీపీ హయాంలో తాడేపల్లిలోని



జగన్ క్యాంప్ ఆఫీస్‌లో ఎగ్ పఫ్‌లకే మూడున్నర కోట్లు ఖర్చు పెట్టారంటూ టీడీపీ.. మొన్నటివరకు కార్నర్ చేసింది. ఆ తర్వాత తాడేపల్లి క్యాంప్ ఆఫీస్‌లో ఫర్నీచర్‌పై కొన్నాళ్లు వార్ నడిచింది. వరద రాజకీయం, సాయంపై కూడా సోషల్ మీడియా వేదికగానే రచ్చ కొనసాగింది. ఇలా ఇష్యూ ఏదైనా ప్రతీ చిన్నదానికి ట్విట్టర్‌లో పోస్టులతో రాజకీయ మంటలు మండుతూనే ఉన్నాయి. సోషల్ మీడియాలో అధికార, విపక్షాల మధ్య విమర్శలు పీక్ లెవల్‌కు చేరుకున్నాయి. ఒకరిపై ఒకరు పెట్టుకునే పోస్టులకు హద్దులు కూడా ఉండటం లేదు.వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్‌స్టా గ్రామ్, ట్విట్టర్ ఇలా సోషల్ మీడియాతోనే ప్రజల మెప్పు పొందే ప్లాన్ చేస్తున్నాయి. రాజకీయ పార్టీలకు అనుబంధ విభాగాలు ఉండటం కామన్. అయితే సోషల్ మీడియా వింగ్ అంటూ ప్రత్యేక విభాగాన్ని పెట్టుకుంటున్నాయి పార్టీలు. ఆ టీమ్‌లతోనే ప్రత్యర్థి పార్టీల ఎత్తులకు పైఎత్తులు వేయడం, విమర్శలను తిప్పికొట్టడంతో పాటు తాము చేసే పనులను సమర్థించుకుంటూ వార్తలను పోస్ట్ చేస్తుంటారు. ప్రతి పార్టీ ఇదే పద్ధతిని ఫాలో అవుతోంది. దీంతో ఏది అసలు, ఏది ఫేక్ వార్తనో తెలియని పరిస్థితి ఉంది. ఏదైనా సోషల్ మీడియా సెంట్రిక్‌గా విమర్శలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. రాజకీయం అంటేనే సోషల్ మీడియా వార్‌గా మారిపోయింది. అబద్ధపు ప్రచారాలు, ఖండనలు.. ఒకటేంటి.. ఏది అసలో? ఏది నకిలీయో తెలియనంతగా పార్టీలు పోస్టులు పెడుతుంటాయి. రాజకీయం నుంచి సోషల్ మీడియా ను వేరుచేసి చూడలేని పరిస్థితి వచ్చేసింది. ఒకరకంగా సోషల్ మీడియానే రాజకీయాన్ని నడిపిస్తోం దని చెప్పొచ్చు. ఇందులో పైచేయిగా సాధించడానికి ఏపీలోని టీడీపీ, వైసీపీ హోరాహోరీగా పోస్టులు పెడుతున్నాయి. ఎన్నికల్లో టీడీపీ గెలుపులో ఆ పార్టీ సోషల్ మీడియా కీరోల్ ప్లే చేసింది. వైసీపీ తన సోషల్ మీడియాను యాక్టివేట్ చేసింది. ఈ రెండు పార్టీలకు అధికా రం దక్కాలన్నా.. చేజారాలన్నా సోషల్ మీడియానే ప్రధాన పాత్ర పోషించే పరిస్థితి వచ్చేసింది.

# గ్రంధి శ్రీనివాస్ ఫ్యాన్ లో ఉక్కపోత

ఏలూరు, అక్టోబరు 26, ఓ మాజీ ఎమ్మెల్యే. తన ఓటమికి కారణమైన వారిపై యాక్షన్ కూడా తీసుకోవడం లేదని రగిలిపోతున్నారట. ఇక గౌరవం దక్కని చోట ఉండేందుకు..తన దారి తాను చూసుకుంటానంటున్నారు ఓ వైసీపీ నేత. అయితే ఆయనకు సైకిల్ రైడ్ నచ్చుతుందా.? గాజు గ్లాస్‌లో టీ తాగాలనుకుంటున్నారా.? లేకపోతే లోటస్ ఫ్లవరే సో బెటర్ అనుకుంటున్నారా అనేది అంతుచిక్కడం లేదు. కానీ కండువా మార్చడం మాత్రం పక్కా అన్నట్లుగా లీకులు ఇస్తున్నారట. పార్టీ పవర్‌లో నుంచి దిగిపోయింది. మరో ఐదేళ్ల తర్వాత పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియదు. ఇప్పుడైతే గతంలో దక్కని గుర్తింపు బాధిస్తోంది. అందుకే వైసీపీలో అసంతృప్తులు బయటపడుతున్నాయి. ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు సైలెంట్‌గా ఉన్న నేతలు ఇప్పుడు నిరసన గళం వినిపిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ..అధినేత తీరుపై గుస్సా అవుతున్నారు. గోదావరి తీరంలో దూకుడు రాజకీయాలకు పెట్టింది పేరైన మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్..పార్టీకి దూరంగా ఉండటం హాట్ టాపిక్‌గా మారింది. ఆయన పార్టీ మారిపోతారంటూ ప్రచారం జరుగుతోంది. అతని అనుచరులు కూడా ఇదే విషయాన్ని చెప్తున్నారు.గోదావరి జిల్లాలకు చెందిన ముఖ్యనేత, భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కొన్నాళ్లుగా పార్టీపై అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికల్లో ఓడిన తర్వాత అసలు బయటకు రాని గ్రంధి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. అందులో భాగంగా మాజీ సీఎం వైఎస్సార్ జయంతి, వర్ధంతి వేడుకలను కూడా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. త్వరలో ఆయన వైసీపీని వీడనున్నట్లు ప్రచారం జరుగుతోంది. 2019 ఎన్నికల్లో జనసేనాని పవన్ కల్యాణ్‌ను ఓడించి సంచలనం సృష్టించిన తనకు..మంత్రి పదవి వస్తుందనుకుంటే తగిన గౌరవం, గుర్తింపు దక్కలేదనే అసంతృప్తితో రగిలిపోతున్నారట గ్రంధి.కాపు సామాజికవర్గానికి చెందిన గ్రంధి శ్రీనివాస్‌కు ఆ వర్గంలో మంచి ఫాలోయింగ్ ఉంది. కానీ వైసీపీలో మాత్రం పెద్దగా గుర్తింపు దక్కలేదని ఆవేదనతో ఉన్నారట. పైగా గ్రంధికి పోటీగా పార్టీలో మరో గ్రూపును తయారు చేశారని రగిలిపోతున్నారట. గత ప్రభుత్వంలో మంత్రి పదవిని ఆశించినా ఆయన ఆశ నెరవేర లేదు. విప్ పదవి ఇచ్చి సరిపెట్టింది వైసీపీ అధిష్టానం. తనకు మంత్రివర్గంలో చాన్స్ దక్కకపోడానికి తాడేపల్లి కేంద్రంగా జరిగిన రాజకీయమే కారణమని భావిస్తున్నారట. తొలి విడత మంత్రివర్గంలో చాన్స్ వస్తుందని ఆశిస్తే..రెండో విడతలో ఇస్తామని చెప్పి చివరి నిమిషంలో గ్రంధి శ్రీనివాస్ పేరును తప్పించారని చెబుతున్నారు. అప్పటి నుంచి అసంతృప్తిగా ఉన్న గ్రంధి అధికారంలో ఉండగా ఎప్పుడూ బయటపడలేదు. ఇప్పటికైనా తన నిరసనను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లకపోతే ప్రయోజనం లేదని భావించి ఇప్పుడు అలకపాన్పు ఎక్కినట్లు తెలుస్తోంది.మరోవైపు భీమవరం నియోజకవర్గంలో తనకు ఎదురే లేదన్నట్లు రాజకీయం చేసిన మాజీ ఎమ్మెల్యే గ్రంధి..పార్టీలో మరో వర్గంతో అంతర్గత పోరు ఎదుర్కోవడం అసంతృప్తికి కారణమైందంటున్నారు. ఇదే నియోజకవర్గానికి చెందిన మోషేన్‌రాజుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంపాటు మండలి చైర్మన్ పోస్టు కట్టబెట్టడం గ్రంధికి రాజకీయంగా ఇబ్బందికరంగా మారిందంటున్నారు. నియోజకవర్గంలో తన హవాకు బ్రేక్ వేసేందుకే మోషేన్‌రాజుకు పెద్ద పదవి ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే ఆవేదన చెందుతున్నట్లు సమాచారం.ఈ అసంతృప్తులతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో ఓ ముఖ్య నేత తనకు వ్యతిరేకంగా పనిచేశారని ఆరోపిస్తున్నారు మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్. తన ఓటమికి ప్రయత్నించిన నేతల లిస్టు పార్టీ అధిష్టానం దగ్గరున్నా, వారిపై చర్యలు తీసుకోలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పార్టీలో కొనసాగతారా? లేదా? అనే చర్చ తెరపైకి వస్తోంది. తన వ్యతిరేకులపై చర్యలు తీసుకోనంతవరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు.ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తో మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, పేర్ని నాని సమావేశం కావడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. త్వరలోనే గ్రంధి టీడీపీలో చేరుతారన్న ప్రచారంతో వైసీపీ అధిష్టానం అలర్ట్ అయింది. గ్రంధి శ్రీనివాస్‌తో కారుమూరి, పేర్నినాని దాదాపు గంట సేపు భేటీ అయ్యారు. అయినా వెనక్కి తగ్గలేదు మాజీ ఎమ్మెల్యే. పార్టీ కోసం ఇంత కష్టపడినప్పటికీ అధిష్టానం విప్ పదవితో సరిపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారట. తాడేపల్లి ప్యాలెస్‌లో కొంతమంది పెద్దలు తన ఎదుగుదలను అడ్డుకున్నారని ఆవేదన చెందుతున్నట్లు తెలుస్తుంది. అయితే ఇప్పటికే ఇతర పార్టీల నేతలతో ఆయన జరిపినట్లు తెలుస్తుంది. ఒకవేళ గ్రంధి శ్రీనివాస్ వైసీపీని వీడితే ఏ పార్టీలో చేరతారనే దానిపై భీమవరంలో హాట్ టాపిక్‌గా మారింది. మాజీ మంత్రుల రాయబారం ఫలిస్తుందా? లేక గ్రంధి శ్రీనివాస్ వైసీపీకి దూరమవుతారా అనేది చర్చనీయాంశంగా మారింది.

## రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అధ్యాత్మిక పర్యాటక యాత్రలకు శ్రీకారం

రాజమహేంద్రవరం అక్టోబరు 26,రాజమహేంద్రవరం సరస్వతి ఘాట్ సమిపంలోని టూరిజం క్యాంప్ ఆఫీస్ వద్ద టూరిజం బస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌జెండా ఊపి ఆధ్యాత్మిక బస్సు యాత్రను ప్రారంభించారు.రాష్ట్ర పర్యాటకాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించాలన్న ఉద్దేశంతో ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఒకరోజు ఆధ్యాత్మిక పర్యటన ప్యాకేజీకి శ్రీకారం చుట్టామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శనివారం ఉదయం రాజమహేంద్రవరం లోని సరస్వతి ఘాటు వద్ద ఇన్ఫర్మేషన్ అండ్ రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం దగ్గర ఆధ్యాత్మిక పర్యటన ప్యాకేజీ బస్సును మంత్రి కందుల దుర్గేష్ జెండా ఊపి ప్రారంభించారు.ఆధ్యాత్మిక భావంతో యాత్రికులు ఇంటికి తిరిగి వెళ్లేలా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావాలని మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు.. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మార్చి నాటికి ప్రస్తుత టూరిజం పాలసీ ముగుస్తుందని ఏప్రిల్ 2025 నుంచి కొత్త టూరిజం పాలసీ అమల్లోకి తీసుకొస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఇప్పటికే కొత్త టూరిజం

పాలసీకి సంబంధించిన కార్యాచరణ ప్రారంభించామని పేర్కొన్నారు. టూరిజం శాఖలో డైరెక్ట్ రిక్రూట్ మెంట్ అంశాన్ని పరిశీలిస్తున్నామని త్వరలో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, టూరిజం బోర్డ్, అధికారులు, అన్ని శాఖల సమన్వయంతో రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధి చేస్తామని మంత్రి కండల దుర్గేష్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసనసభలో రాజానగరం, రాజమండ్రి, అనపర్తి ఎమ్మెల్యేల సూచనల మేరకు వారాంతంలో ఉమ్మడి తూర్పుగోదావరిలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలు, పంచారామ క్షేత్రాలను కలిపేలా ఒక రోజు టూర్ ప్యాకేజీని ప్రవేశపెట్టామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఈ యాత్రకు వెళ్లే పర్యాటకులకు రాజమండ్రి లోని సరస్వతి ఘాట్ వద్ద ఉన్న ఐ ఆర్ ఓ కార్యాలయం దగ్గర ప్రతి శనివారం బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పర్యాటకానికి ముఖద్వారమైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలుత అత్యంత ప్రసిద్ధి చెందిన కోరుకొండ స్వయంభూ శ్రీ లక్ష్మి నర్సింహాస్వామి దేవస్థానం, రత్నగిరి కొండపై వెలసిన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయ దర్శనం, ఆ తర్వాత పితృముక్తి క్షేత్రంగా, పాదగయ తీర్థంగా పేరొందిన పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వరస్వామి ఆలయం దర్శించిన పిమ్మట విశాలమైన ప్రాకారాలతో, చాళక్యుల శిల్పకళా నైపుణ్యంతో అలరారుతూ పంచారామ క్షేత్రాల్లో ఒకటైన సామర్లకోటలోని శ్రీ చాళుక్య కుమారరామ శ్రీ భీమేశ్వరస్వామి ఆలయాన్ని యాత్రికులు దర్శించుకొంటారని తెలిపారు. సామర్లకోట దేవాలయంలో మధ్యాహ్నం అన్న ప్రసాదాలు స్వీకరించిన అనంతరం ద్రాక్షారామంలోని భీమేశ్వరస్వామి ఆలయాన్ని యాత్రికులు సందర్శిస్తారని తెలిపారు. ఆ తర్వాత అనపర్తి లోని లక్ష్మి గణపతి దేవాలయాన్ని, కోనసీమ తిరుపతిగా పేరుగాంచిన వాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని యాత్రికులు సందర్శించేలా ఒక రోజు టూర్ ప్యాకేజీని నేటి నుండి అమలు చేస్తున్నామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

## కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు

విశాఖపట్నం,కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని విశాఖ జిల్లా ఇన్చార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు.జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అధ్యక్షతన విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది ఈ సందర్భంగా మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో విద్వాంసకర

పాలన జరిగిందని,నాయకులు విశాఖను దోచుకున్నారని,ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి అంశాన్ని తూచా తప్పకుండా అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో దుర్మార్గపు పాలనను అంతం చేయడానికి కొందరు నాయకులు త్యాగాలు చేశారని, మూడు పార్టీలలో కష్టపడి పని చేసినవారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని,గత వైసిపి ప్రభుత్వం వైఫల్యాల వలన ఇప్పటికీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వకపోయినా ప్రతిపక్ష హోదాలో ఉన్నట్లు జగన్ మాట్లాడుతున్నారని అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి, తండ్రికి గాయాలు

కడప,వేంపల్లి సమీపంలోని మాలంక బ్రిడ్జి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. బుల్లెట్ వాహనంలో వెళుతున్న వెంకట రమణారెడ్డి, బాలగంగాధర్ రెడ్డి అనే తండ్రి కొడుకును ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఘటనలో కుమారుడు బాలగంగాధర్ రెడ్డి మృతి చెందాడు.

వీరపు నాయుని పల్లి మండలం మొయిలచెరువు గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. గాయపడ్డ వెంకటరమణారెడ్డిని 108 లో వేంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

